27 నుంచి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షా' తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

దుండిగల్,ఫిబ్రవరి8: కాలనీలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పని చూస్తున్నానని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి కావ్య, సాయిఅనురాగ్ కాలనీలోకి కొంతకాలంగా పై కాలనీల నుంచి మురుగునీరు చేరుతున్నది. దీంతో కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి తన సొంత డబ్బులతో మురుగునీటి పైప్ లైన్ వేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 8: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరి మండలం అయ్యవారిగూడేనికి చెందిన ఎండీ మహ్మద్(21) ఓ ప్రైవేటు కళాశాలలో బీ.టెక్ నాలుగో సంవత్సరం చదువుతూ అక్కడే వసతి గృహంలో ఉంటున్నాడు. బుధవారం కళాశాలకు వెళ్లకుండా వసతిగృహంలోనే ఉన్నాడు. కాగా స్నేహితులు కళాశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు వచ్చి చూడగా ఉరి వేసుకొని కన్పించాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళా సంఘాలకు అండగా నిలుస్తా..

● శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌పీలు

మియాపూర్ ఫిబ్రవరి 8 : మహిళల ఆర్థికాభివృద్ధిలో కీలకమైన మహిళా సంఘాలకు తాను ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. మహిళలను పొదుపు దిశగా మరింతగా చైతన్య పరచాలని సూచించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మహిళా సమాఖ్య సంఘాల ఆర్‌పీలు ఎమ్మెల్యే గాంధీని గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ పరంగా వారికి అందాల్సిన వసతులను సైతం కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ వీకర్ సెక్షన్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంఘాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కాలనీ అభివృద్ధికి తన పూర్తి తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

మాదాపూర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ ఖాయిదామ్మ కుంట చెరువు కట్ట వద్ద గల మైసమ్మ దేవాలయంలో 9వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ విచ్చేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతులు

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 8: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సభ్యులు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలను అందించారు.అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

మెదడుకు పదును పెడితే నిపుణులు అవుతారు..

జీడిమెట్ల, ఫిబ్రవరి 8: మెదడుకు పదును పెడితే ప్రతి విద్యార్థి భావితరాల నిపుణులు అవుతారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి ఐ.విజయకుమారి అన్నారు. చింతల్ డివిజన్ పరిధి పట్వారీ ఎన్‌క్లేవ్‌లో ఉన్న నవజ్యోతి పాఠశాలలో రెండు రోజుల పాటు జరుగనున్న వైజ్ఞానిక ప్రదర్శన 2024ను ఆమె ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన అకృతులను డీఈఓ తిలకించారు. ఎంఈఓ ఆంజనేయులు, నవజ్యోతి విద్యాసంస్థల చైర్మన్ మలిరెడ్డి ఇందిరా రవీందర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణ, రూపాంజలి, గాంధీనగర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరాములు, రమేశ్, ఏఆర్‌సీ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మేడ్చల్-మల్కాజిగిరి డీఈఓ ఐ.విజయకుమారి

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

– కొండాపూర్, ఫిబ్రవరి 8

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో – గాంధీ బుణాకర్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువారం పలువురు కళాకారులు ఆకట్టుకున్నారు.

నిరుద్యోగులకు అవగాహన సదస్సు

అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎంఎస్ఎంఈ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సుమతి

దుండిగల్,ఫిబ్రవరి8: ప్రభుత్వం అందించే రుణాలు, సబ్సిడీలు, వాటి వినియోగం, పారిశ్రామికవేత్తలుగా ఎదిగే విధానంపై గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న, మధ్యతరహా) సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సుమతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ రుణాలకు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి..? సబ్సిడీలు పొందే విధానం, పొందిన రుణాలతో పారిశ్రామికవేత్తలుగా ఎలా ఎదగవచ్చో వివరించారు. సీఎఐఆర్- సీఎఫ్‌టీఆర్ఐ, హైదరాబాద్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపల్ డా.పీజీ.ప్రభాకర్ రావు, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ టెక్నికల్ చీఫ్ మేనేజర్ వి.కిరణ్‌కుమార్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ డిప్యూటీ డైరెక్టర్, రీజనల్ ఆఫీసర్ ఎన్ నటరాజ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మూడో డివిజన్ కార్పొరేటర్ వెంకటరామయ్య, సుందరయ్య భవన్ నిర్వహన కమిటీ కన్వీనర్ మల్లయ్యచారి, యువతీ, యువకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా..

మాదాపూర్, ఫిబ్రవరి 8: మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో గురువారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఉన్నారు.

కనీస వేతనాల కోసం కృషి చేస్తా..

జీడిమెట్ల, ఫిబ్రవరి 8 : పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల కనీస వేతనాల అమలు కోసం కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సాయినాథ్ కంపెనీ వద్ద ఐఎన్‌టీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు.

చందానగర్ అభివృద్ధికి కృషి

కొండాపూర్, ఫిబ్రవరి 8 : డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో రూ. 25లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చందానగర్ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వరలక్ష్మి, మాధవి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, ఫిబ్రవరి 8: ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని బాచుపల్లి తాసీల్దార్ పూల్‌సింగ్ హెచ్చరించారు. బాచుపల్లి మండలం, నిజాంపేట్‌లోని సర్వేనంబర్ 191 ప్రభుత్వ స్థలంలో వెలసిన గదులను గురువారం ఆయన సిబ్బందితో తొలగింపజేశారు. అదేవిధంగా సర్వేనంబర్ 82లో ప్రభుత్వ అసైన్డ్ భూమి చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్‌ను సైతం తొలగించారు.

వినికిడి సమస్యకు కాక్లియర్ ఇంప్లాంట్‌తో మెరుగైన ఫలితాలు

కొండాపూర్, ఫిబ్రవరి 8 : పుట్టుకతో వచ్చే లోతైన లోపంతో బాధపడే చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్సతో మెరుగైన ఫలితాలు చేకూరుతాయని మెడికవర్ దవాఖాన ఓటోలార్జినాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ సంపూర్ణ ఘోష్ అన్నారు. గురువారం దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినికిడి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు అందించిన చికిత్స, ఫలితాల వివరాలను వెల్లడించారు. గత 6 నెలల్లో 10 మందికి పైగా కాక్లియర్ ఇంప్లాంట్‌లను విజయవంతంగా అమర్చినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి దవాఖాన నామమాత్రపు ఖర్చులతో చికిత్సలను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, చిన్నారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్, ఫిబ్రవరి 8 : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం పరిశీలించారు. డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లోని షిర్డి సాయి బాబా దేవాలయ రెండో వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పూజాదికాలలో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ సహా ఇతర నేతలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

మియాపూర్, ఫిబ్రవరి 8: ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా చందానగర్ సర్కిల్ పరిధిలో మహాలక్ష్మి పథకం దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభమైంది. సర్కిల్ వ్యాప్తంగా 5600 లకుపైగా దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. వీటి ఆధారంగా ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు, బిల్ కలెక్టర్లు సహా ఇతర సిబ్బంది దరఖాస్తు దారు ఇంటికి వెళ్లి వివరాల సేకరణను చేపడుతున్నారు. సర్కిల్ పరిధిలోని నాలుగు వార్డులలో దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభమైనందున దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలని సర్కిల్ డీసీ వంశీకృష్ణ సూచించారు. రూ. 500లకు సిలిండర్ పథకం కోసం తగు పరిశీలన చేపట్టి అవసరమైన అదనపు వివరాలను సేకరిస్తారన్నారు.

యువకుడిపై పోకిరీల దాడి..

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 8: ఊబర్ కారు నడుపుకుంటున్న యువకుడిని ఆరుగురు పోకిరిలు కారుకు అడ్డం తిరిగి తీవ్రంగా గాయపర్చిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పనగర్ ప్రాంతానికి చెందిన అర్జున్‌సింగ్(24) చదువుకుంటూ రాత్రి ఊబర్ కారు నడుపుతూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. రాత్రి సమయంలో ఊబర్ కారులో వెళ్తుండగా సుచిత్రలోని తేజా వైన్స్ వద్ద నడిరోడ్డుపై కార్లు వెళ్లకుండా మద్యం సేవిస్తూ వచ్చిపోయే వారిని కొందరు ఆపుతున్నారు. ఇదేక్రమంలో ఆ దారి గుండా వెళ్లాల్సిన అర్జున్‌సింగ్ వారిని జరగమని కోరడంతో ఆరుగురు వ్యక్తులు అర్జున్‌సింగ్‌పై దాడి చేశారు. సంఘటనా స్థలంలో పోకిరిల్లో ఒకరిది ఫోన్ కిందపడడంతో దానిని తీసుకొని స్థానిక పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్

కొండాపూర్, ఫిబ్రవరి 8 : డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కొండాపూర్ కార్పొరేటర్ హమీద్ పటేల్ తెలిపారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని ఓయూ ప్రొఫెసర్ కాలనీలో రూ.80లక్షలు, ప్రేమ్‌నగర్ ఏ బ్లాక్‌లో రూ.23లక్షలతో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ విక్రమ్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

బైక్ స్టంట్స్ చేస్తున్న యువకుల అరెస్టు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 8: రహదారులపై ప్రమాదకరంగా బైక్‌స్టంట్స్ చేస్తున్న ఆరుగురు బైక్ రైడర్లను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. హైటెక్‌సిటీ నాలెడ్జి సిటీలో టీ-హబ్ రహదారిపై గురువారం తెల్లవారుజామున బైక్ స్టంట్స్ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రమాదకరంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ఇతరులకు ఇబ్బంది కలిగేలా వాహనాలు నడుపుతున్నారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సోటీ పోలీసులు లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన షేక్ సల్మాన్(21), అప్రోజ్‌ఖాన్(20), మహ్మద్ సోహైల్(20), మీర్ సోహెల్(20), ఇమ్రాన్‌ఖాన్(21), ఇమ్రాన్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. వారి వద్ద మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురుని అరెస్టు చేసిన రాయదుర్గం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు రెమెడీలో గైనకాలజీ ఆరోగ్య శిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 8 : కేపీహెచ్‌బీ కాలనీ 4వ రోడ్డులోని రెమెడీ వైద్యశాలలో ఉచిత గైనకాలజీ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యశాల ప్రాంగణంలో ప్రముఖ గైనకాలజిస్ట్ బీవీ శోభ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మంగళసూత్రం దొంగల అరెస్ట్

బాలానగర్, ఫిబ్రవరి 8 : మహిళను అడ్రస్ అడిగి మాటల్లో పెట్టి తన మంగళసూత్రాన్ని కాజేసిన నిందితులను బాలానగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ సీఐ పీ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల3వ తేదీన మధ్యాహ్నం ఉప్పల్‌కు చెందిన పల్లపు వెంకటేశ్ (26) దేశెట్టి చక్రపాణి(31) కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలో ఓ మహిళ మెడలోని 3.5 తులాల మంగళసూత్రాన్ని లాక్కొని వెళ్లిపోయారు. కేసు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు. మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కూకట్‌పల్లి @4,71,878 ఓటర్లు

● తుది ఓటరు జాబితా విడుదల

● కొత్తగా జాబితాలో చేరిన ఓటర్లు 3,641

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయంలో తుది ఓటరు జాబితాను ప్రచురిస్తున్న ఈఆర్‌వో రమేశ్, ఏఈఆర్‌వో కృష్ణయ్య

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 8 : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. తాజా ఓటరు జాబితా ప్రకారం కూకట్‌పల్లిలో 4,71,878 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత అర్హులైన ఓటర్లందరికి ఓటు హక్కును కల్పించాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ అధికారులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు, ఓటరు జాబితాలో పేరులేని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కును కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించి అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించారు. వాటన్నింటినీ పరిశీలించిన పిమ్మట తుది ఓటరు జాబితాను ప్రచురించారు.

కూకట్‌పల్లిలో పెరిగిన ఓటర్లు 3,641

కూకట్‌పల్లి నియోజకవర్గం తుది ఓటరు జాబితా ప్రకారం 4,71,878 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 2,46,371, మహిళలు 2,25,386, ఇతరులు 121 ఉన్నారు. ఇటీవల ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాలో 4,68,237 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,44,969, మహిళలు 2,23,146, ఇతరులు 122 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరలు, ఫిర్యాదులను స్వీకరించి అర్హులైన ఓటర్లను గుర్తించి జాబితాలో చేర్చగా కేవలం 3,641 మంది ఓటర్లు మాత్రమే పెరిగారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఓటరు జాబితాతో పోల్చితే 8,014 మంది ఓటర్లు పెరిగారు.

తుది ఓటరు జాబితా.. (8 ఫిబ్రవరి, 24)	
పురుషులు	2,46,371
మహిళలు	2,25,386
ఇతరులు	121
మొత్తం	4,71,878

29 వేల ఫిర్యాదులు..

ముసాయిదా ఓటరు జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలను తెలపాలని కోరడంతో ప్రజలనుంచి సుమారు 29 వేల ఫిర్యాదులు వచ్చాయి. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్లలో కలిపి 29,133 మంది దరఖాస్తులు చేయగా.. ఇందులో కొత్తగా ఓటరు నమోదుకు 15 వేలు, తొలగింపుల కోసం 6,561, తప్పిదాల సవరణ, చిరునామా మార్పుకోసం 6,864 దరఖాస్తులు వచ్చాయి. ముసాయిదాపై వచ్చిన అభ్యర్థనలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన పిమ్మట అనర్హుల ఓటర్లను.. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారిని, ఒకే వ్యక్తి ఓటు హక్కు కోసం రెండుమూడు చోట్ల దరఖాస్తు చేసుకోవడం, జాబితాలో పేరు ఉన్నా మరలా దరఖాస్తు చేసుకోవడం లాంటి కారణాలతో పలు దరఖాస్తులను తిరస్కరించారు. అర్హులైన వారందరినీ తుది ఓటరు జాబితాలో చేర్చుతూ జాబితాను ప్రచురించారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ..

ఓటరు జాబితాలో పేరు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్లలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను విడుదల చేశాం. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుంటే చేసుకోవాలని కోరుతున్నాం. ఎన్నికల నామినేషన్ గడువు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది.

– రమేశ్, ఈఆర్వో, కూకట్‌పల్లి నియోజకవర్గం

శేరిలింగంపల్లి నియోజకవర్గ ఓటర్లు 7,47,671

మియాపూర్, ఫిబ్రవరి 8 : త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటర్ల జాబితాను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రదర్శించారు. నియోజకవర్గంలో మొత్తం 7,47,671 నిర్ధారణ అయ్యారు. పురుషులు 395460, మహిళలు 3,52,067 ఓటర్లు కాగా 144 ఇతర ఓటర్లున్నారు. నియోజకవర్గంలోని 622 పోలింగ్ బూత్‌లలో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. కాగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. తాజా నమోదుతో నియోజకవర్గ వ్యాప్తంగా 15,000 మంది కొత్త ఓటర్లు పెరిగారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు ఈఆర్‌వో రజనీకాంత్‌రెడ్డి, ఏఈఆర్‌వో వంశీకృష్ణ తెలిపారు.

చెత్త సేకరించే కార్మికుల మధ్య ఘర్షణ : ఒకరికి తీవ్ర గాయాలు

దుండిగల్, ఫిబ్రవరి 8: చెత్త సేకరణ విషయంలో ఆటోకార్మికుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు ఏకపక్ష దాడికి దిగగా ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన పరమేశ్, తిరుమశ్ లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబందించిన చెత్తసేకరణ (స్వచ్ఛ ఆటో) కార్మికులుగా పనిచేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి సైతం ఇందులోనే చెత్తసేకరణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరందరు కార్పొరేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నెల 6వ తేదీన రాత్రి 10:30గంటల ప్రాంతంలో సుధాకర్ అనే కార్మికుడు ప్రగతినగర్‌లోని రాంఖీ కన్‌స్ట్రక్షన్స్ ఏరియాలో ఇండ్లలో చెత్తను సేకరిస్తున్నాడు. అయితే ఈ ప్రాంతంలో తాము కొంత కాలంగా చెత్తను తీసుకెళ్తుండగా రాత్రిపూట మీరు ఎందుకు సేకరిస్తారని పరమేశ్, తిరుమలేశ్‌లు సుధాకర్‌ను ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్యన వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పరమేశ్‌పై సుధాకర్, అతడి భార్య శిరీష, మల్లికార్జున్, దస్తగిరి దాడి చేశారు. పరమేశ్ భార్య సువర్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

IN THE COURT OF THE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE COURT, TADEPALLIGUDEM. West Godavari district. Andhrapradesh.
O.S. 492/2023

Between:
Chilakanti Radhika
And
...Petitioners/ Plaintiff

1. Moparthi Anand
2. Bymuthukala Bharathi
...Defendants/Respondent

Publication against 1st Defendants Moparthi Anand S/o Mohanarao, Hindu, Male, aged 46 years, Business, Residing at Plot No.54, 2nd floor, Navodaya Colony, Mahankali Nagar, Tulasi Vanam, Kukatpaily,. Present address Plot No 438, Chakradhari Nagar Road NO 7, Allwyn colony, Vivekanada nagar Kukatpally Hyderabad, Telangana State. SCJ Kukatpally.

NOTICE

The plaintiff had filed the above suit for recovery of the suit debt against the defendants. The Honourable court ordered service of summons through substitute service by way of paper publication against 1st defendant. Hence publish in the news paper. Hence this is inform to 1st defendant to attend the above Honourable court on 16-02-2024 at 10.30 A.M in person or through an advocate, otherwise the case will be decidein you absence.

// BY ORDER OF THE COURT //
Sd/- **M.A.V.L.N. ACHARYUIU,**
B.Com., B.L., Advocate,
Beside Gokula Veeraswamy Ramalayam
Balajidas Street, Subbaraopeta,
Tadepailigudem - 534101. **Ph: 99632-30864**

**IN THE COURT OF THE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE COURT TADEPALLIG